TITLE CODE: APTEL16281

తెలుగు దినపత్రిక


# పీపుల్స్ మోటివేషన్

People's Motivation

ఆంధ్రప్రదేశ్ / తెలంగాణ

సంపుటి : 01 | సంచిక : 196 | ఎడిటర్ : ఎం. రమేష్ | సోమవారం, జూన్ 17, 2024 | పేజీలు : 08 | వెల రూ. 5.00/-

## ముస్లిం సోదరులకు సీఎం చంద్రబాబు బక్రీద్ శుభాకాంక్షలు



అమరావతి : త్యాగగుణాన్ని ప్రబోధించే బక్రీద్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. సోమవారం బక్రీదు పండుగ సందర్భంగా ముస్లింలకు చంద్రబాబు, మంత్రి లోకేష్ శుభాకాంక్షలు తెలిపారు. మానవుల్లో త్యాగనిరతిని వ్యాపింపచేయడమే బక్రీద్ ఉద్దేశమని వారన్నారు. స్వార్థం, రాగద్వేషాలు వదిలిపెట్టి త్యాగగుణం పెరగాలని అన్నారు. పండుగ సందర్భంగా పేదలకు ఆహార వితరణ చేస్తానని చంద్రబాబు పేర్కొన్నారు. ప్రజలందరూ సమైక్యత, సమానత్వం దిశగా అడుగులు వేయాలని, ఇస్లాంలో త్యాగం, దానగుణాలకు ప్రత్యేకమైన స్థానముందని వెల్లడించారు.

## 30 నెలల్లో అమరావతి నిర్మాణం



విజయవాడ: వచ్చే 30 నెలల్లో అమరావతిలో ఏపీ రాజధాని నిర్మాణ పనులు పూర్తిచేసే లక్ష్యంతో ముందుకు సాగుతామని ఏపీ మంత్రి నారాయణ వెల్లడించారు. వెలగపూడిలో ఆదివారం మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడారు. మూడు దశల్లో చేపట్టనున్న రాజధాని నిర్మాణానికి రూ.లక్ష కోట్ల వ్యయం అవుతుందని, మొదటి దశ పనులకు 48 వేల కోట్లు ఖర్చవుతుందని వివరించారు. 15 రోజులపాటు అధ్యయనం చేసి నిర్దేశిత గడువుతో పాత మాస్టర్ ప్లాన్ ప్రకారమే నిర్మాణ పనులను ప్రారంభిస్తామని చెప్పారు.



## రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్‌ను కలిసిన జిల్లా కలెక్టర్

**కర్నూలు, జూన్ 16 (పీపుల్స్ మోటివేషన్):-**

రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్ ను ఆదివారం ప్రముఖులు కలిశారు. సంకల్ బాగ్ లోని మంత్రి నివాసంలో జిల్లా కలెక్టర్ డా. జి.సృజన మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం ఇరువురు జిల్లా అభివృద్ధి విషయాలపై చర్చించుకున్నారు. అనంతరం డీఆర్వో మధుసూదన్ రావ్, సీఎఫ్ఓ పి. రామక్రిష్ణ, రిటైర్డ్ డీఎస్పీ మహబూబ్ బాషా, టిడిపి నంద్యాల జిల్లా అధ్యక్షులు మల్లెల రాజశేఖర్, రాగమయూరి బిల్డర్స్ అధినేత కె.జె రెడ్డి, మాంటిస్సోరి విద్యాసంస్థల అధినేత రాజశేఖర్, టిడిపి నాయకులు బొల్లెద్దుల రామక్రిష్ణ, పలువురు నాయకులు, కార్యకర్తలు, స్థానికులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.



## తెలంగాణకు ఎల్లో అలర్ట్ జారీ చేసిన వాతావరణ శాఖ





- **ఈ నెల 23 వరకు తెలంగాణలో వర్షాలు**
- **పలు చోట్ల తేలికపాటి నుంచి భారీ వర్షాలు**
- **అనేకచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు**
- **గరిష్ఠంగా 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు**

హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలంగాణకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఈ నెల 23వ వరకు ఐదు రోజుల పాటు రాష్ట్రంలో తేలికపాటి నుంచి భారీ వర్షాలు వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. జూన్ 16 నుంచి 17వ తేదీ ఉదయం వరకు కామారెడ్డి, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. మెదక్, నిజామాబాద్, ఆసిఫాబాద్, కామారెడ్డి, మంచిర్యాల, సంగారెడ్డి, రాజన్న సిరిసిల్ల, మల్కాజ్ గిరి, ములుగు, రంగారెడ్డి, కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, హైదరాబాద్, సూర్యాపేట, నల్లగొండ, మేడ్చల్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని వివరించింది. అదే సమయంలో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని వెల్లడించింది.


## విలేఖరులు కావలెను

అసలైన అక్షర జ్ఞానాన్ని తెలియజేస్తూ... విలువలతో కూడిన జీవన శైలిలో ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ.. ప్రజల సాధకబాధకాల్లో మమేకమై పరిష్కార మార్గాలపై ప్రేరణ కలిగించాలి అనుకుంటున్నారా..? బాధ్యతయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా..? అయితే రండి... అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం..





పీపుల్స్ మోటివేషన్ తెలుగు దినపత్రికలో

నియోజకవర్గ ఇంచార్జ్‌లు మండల రిపోర్టర్‌లు కావలెను..

సంప్ర : 80086 22746

తెలుగు దినపత్రిక
పీపుల్స్ మోటివేషన్
People's Motivation

# సబ్సిడీ విత్తనాలను రైతులకు అందజేసిన మాండ్ర శివానందరెడ్డి ఎమ్మెల్యే గిత్తా జయ సూర్య









**నందికొట్కూరు, జూన్ 16 (పీపుల్స్ మోటివేషన్):-**

నందికొట్కూరు నియోజకవర్గం లోని మిడుతూరు ఆలూరు గ్రామాలలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నంద్యాల టీడీపీ సీనియర్ నాయకుడు మాండ్ర శివానందరెడ్డి, ఎమ్మెల్యే గిత్త జయ సూర్య సబ్సిడీ విత్తనాలను రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా శివానందరెడ్డి, జయ సూర్య మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ రైతుల పక్షపాతి ప్రభుత్వాన్ని రైతులను ఆదుకోవడంలో తెలుగుదేశం పార్టీ ఎప్పుడు ముందుంటుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాండ్ర సురేంద్ర నాథ్ రెడ్డి, మండల కన్వీనర్ ఖాతా రమేష్ రెడ్డి, గుండం రమణారెడ్డి, శివ ప్రసాద్ రెడ్డి, సర్పంచులు, వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## అధికారులు వెంటనే స్పందించి కేసీ కెనాల్ కు మరమ్మత్తులు చేయించాలి: రైతులు





**నందికొట్కూరు, జూన్ 16 (పీపుల్స్ మోటివేషన్):-**

నందికొట్కూరు మండలం శాతన కోట సమీపంలోని కేసీ కెనాల్ గోడలు కూలిపోయి ప్రమాదం సంభవించే అవకాశం ఉందని రైతులు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ సమస్యపై పలుమార్లు సంబంధిత అధికారులకు తెలియజేసిన నిర్లక్ష్యపు ధోరణితో పట్టించుకోకుండా ఇసుక బస్తాలతో తాత్కాలిక మరమ్మతులు చేయించడంతో చిన్నపాటి వర్షానికే గండి పడిందని వారన్నారు. ఇప్పటికైనా అధికారులు తక్షణమే స్పందించి కేసీ కెనాల్ కు మరమ్మత్తులు చేయించాలని వారు కోరారు.

## ముస్లిం సోదరులకు, వారి కుటుంబ సభ్యులకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు

**రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం,ఆహార పరిశుద్ధి శాఖా మంత్రి టి.జి. భరత్ మరియు కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన**



**కర్నూలు, జూన్ 16 (పీపుల్స్ మోటివేషన్): -**

బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లాలో ఉన్న ముస్లిం సోదరులకు, వారి కుటుంబ సభ్యులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం,ఆహార పరిశుద్ధి శాఖా మంత్రి టి. జి. భరత్ మరియు కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన జిల్లా ముస్లిం సోదరులకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ముస్లింల ఆరాధ్య గ్రంథం దివ్య ఖురాన్ ప్రకారం సమాజంలో పేరుకుపోతున్న రుగ్మతల నుంచి మానవాళిని జాగృతపరుస్తూ సన్మార్గంలో నడిపించేందుకు అల్లాహ్ పంపిన ప్రవక్తల్లో ఒకరైన హజరత్ ఇబ్రహీం త్యాగనిరతికి ప్రతీకగా జరుపుకొనే పండగ బక్రీద్ అని, ఎంతో పవిత్రంగా జరుపుకునే బక్రీద్ పండుగ దాన గుణానికి, త్యాగానికి ప్రతీక అని వారు తెలిపారు. కుటుంబ సభ్యులతో సంతోషంగా పండుగ జరుపుకోవాలని వారు ఆకాంక్షించారు.

## కోరిన సమాచారం ఇవ్వని అధికారులపై పోలీసు కేసు పెట్టవచ్చు : రాష్ట్ర సమాచార కమిషన్

**దేవనకొండ, జూన్ 16 (పీపుల్స్ మోటివేషన్):-**




ఆర్టీఐ దరఖాస్తు ద్వారా సమాచారం అడిగిన తరువాత మా దగ్గర ఇంతే సమాచారం ఉంది అంటూ కొంత సమాచారం ఇచ్చి మిగిలింది మా వద్ద లేదని ఇస్తున్నారు. ఉద్యోగులు అలా లేదు అనే ముందు అట్టి ఫైళ్లు ఏమైయ్యాయి కనబడని ఫైళ్లు పోయిన ఫైళు గురించి పోలీస్ ఫిర్యాదు చేశారా? లేదా చేయకపోతే ఎందుకు చేయలేదు? అంత నిర్లక్ష్యంగా ఎందుకు వ్యవహరించారు. ఉద్యోగ బాధ్యతల్లో తమ వంతు కర్తవ్యం ఎంత వరకు నిర్వర్తిస్తున్నారా? లేదా? అలా పోలీసు కంప్లైంట్ ఇవ్వని అధికారి పై ఆర్టీఐ దరఖాస్తు దారుడు కేసులు పెట్టవచ్చునని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నాయి. ఫైళ్లు పోయినా చర్యలు లేవా? ఉంటే ఎటువంటి చర్యలు తీసుకుంటారు.? ఇకపై ఆర్టీఐ దరఖాస్తు ద్వారా సమాచారం అడిగిన సోదరి.. సోదరులారా.. అడిగిన సమాచారం కొంత ఇచ్చి మిగిలిన సమాచారం ఇవ్వని పక్షంలో అట్టి సమాచారం వారి వద్ద లేదని భావించి వారిపై పోలీసు ఫిర్యాదు చేయవచ్చు. ఈ విషయం స్వయంగా సమాచార కమిషన్ వారు తెలిపారు. ఇకపై ఆర్టీఐ కార్యకర్తలు గుర్తు ఉంచుకొని అట్టి అధికారులపై చర్యలు కొరకు పోలీసు స్టేషనులో ఫిర్యాదు చేయవచ్చు.

## క్రీడా రంగం అభివృద్ధికి కృషి చేస్తా...కర్నూలు ఎం.పి బస్తిపాటి నాగరాజు



**కర్నూలు, జూన్ 16 (పీపుల్స్ మోటివేషన్):-**

క్రీడా రంగం అభివృద్ధికి కృషి చేస్తానని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు తెలిపారు.. క్రీడా సంఘాల ప్రతినిధులు, స్టేడియం శిక్షకులు ఎంపీ నాగరాజును మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు..ఈ సందర్భంగా వారు పలు సమస్యలను ఎంపీ దృష్టి కి తీసుకెళ్లారు..అనంతరం ఎం.పి నాగరాజు మాట్లాడుతూ పిల్లలకు చదువు తో పాటు క్రీడలు ఎంతో అవసరమని, క్రీడలు మనిషి శక్తిని కొత్త పుంతలు తొక్కించడంతో పాటు మనోరంజక సాధనాలలో ముఖ్యభాగమై పోయిందన్నారు.. సాంప్రదాయకమైన ఆటల కంటే, ఆధునిక ప్రపంచ గుర్తింపుగల పోటీ ఆటలలో ప్రావీణ్యము సంపాదిస్తే, పేరు, ప్రతిష్ఠలతో పాటు మంచి ఆదాయము లభించే అవకాశాలున్నాయన్న ఆయన .. జిల్లాలో ప్రతిభావంతులైన క్రీడాకారులకు కొదవ లేదని అయితే వారికి సరైన సదుపాయాలు కలిపిస్తే రాష్ట్ర, జాతీయ స్థాయిలో మరింత రాణిస్తారన్నారు..ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా యోగ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ డ్రాగన్ బోటు అసోసియేషన్ అధ్యక్షులు, జి.శ్రీధర్ రెడ్డి,జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి బి.భూపతి రావు, రాష్ట్ర యోగ సంఘం ప్రధాన కార్యదర్శి అవినాష్ శెట్టి ,జిల్లా హ్యాండ్ బాల్ సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ రుద్రా రెడ్డి,టిడిపి లీగల్ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు దాశెట్టి శ్రీనివాసులు పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలి

**దేవనకొండ, జూన్ 16 (పీపుల్స్ మోటివేషన్):-**



ఆలయ అభివృద్ధికి విరాళ మాందిస్తున్న నారాయణరెడ్డి గ్రామాభివృద్ధిలో గ్రామస్తులు అందరూ భాగస్వాములు కావాలని కర్నూలు జిల్లా వినియోగదారుల కమిషన్ సభ్యులు న్యాయవాది నారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ బాట మీద రాజన్న అన్నారు. మండలంలోని తెర్నేకల్ గ్రామంలో ఆదివారం ఎల్లమ్మ పేట వీధిలోని ఎల్లమ్మ ఆలయ అభివృద్ధిపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జన్మించిన ఊరిని మర్చి పోకూడదన్నారు.గ్రామ అభివృద్ధిలో తమ వంతు సహకారం అందిస్తామన్నారు. ఆలయ శిఖర నిర్మాణానికి రూ. 25 వేలును వినియోగదారుల కమీషన్ సభ్యులు న్యాయవాది నారాయణరెడ్డి అందించారు. అదేవిధంగా ఆలయ గోపుర నిర్మాణం పూర్తయిన తర్వాత రంగులు వేయిస్తామని హామీ ఇచ్చారు. 2017సంవత్సరంలో సర్పంచ్ గా పనిచేసిన రాజన్న కళ్యాణ మండపాన్ని నిర్మించడం జరిగిందని కమిటీ సభ్యులు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆలయ అభివృద్ధికి సహకరిస్తామని సమావేశంలో పాల్గొన్న గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో వార్డ్ మెంబర్ మాదన్న, గ్రామ పెద్దలు హనుమన్న, లక్ష్మన్న, పూజారి నారాయణస్వామి, వాసు, చిన్న అనుమంతు. పుల్లాపురం కిష్టన్న పాల్గొన్నారు.

## నాన్న కన్నీళ్లు మనకు కనిపించనియ్యడు



**నెక్కొండ, జూన్ 16 (పీపుల్స్ మోటివేషన్):-**

ఫాదర్స్ డే సందర్భంగా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న కవితకు ఫిదా అయినా ప్రజలు. ఫాదర్స్ డే పురస్కరించుకొని ఆదివారం రోజు సోషల్ మీడియాలో వివిధ కదనాలు ప్రచారం అవుతున్నాయి. అందులో ఒక్క కవిత ప్రతి ఒక్కరిని కదిలించింది అది ఈ విధంగా ఉంది. నాన్న మనకోసం ఏం చేశాడో ఏం కోల్పోయాడో మనకు తెలియదు..! తెలియనియ్యాడు జీవితాంతం పిల్లల కోసం తపిస్తూ, వారి అభివృద్ధి కోసం పాటుపడే వ్యక్తి తండ్రి తన పిల్లల కోసం జీవితంలో ఎన్ని కోల్పోతాడో. నాన్న మన కోసం ఏం చేశాడో మనకు తెలియదు. ఎన్ని కష్టాలు పడ్డాడో తెలియదు. తెలియనియ్యడు, ఎందుకంటే.. అది నాన్నలోని ప్రత్యేకత ఎవరికీ చెప్పడు. పిల్లలకి, భార్య కి అసలు చెప్పడు. అమ్మ లా ప్రేమ ను బయటికి చూపించడం నాన్న కు రాదు. నాన్న ఇంటికి ఎప్పుడో వస్తాడు, వెళ్లిపోతాడు. బిజీగా ఉన్న నాన్న రాత్రిపూట ఇంటికి వచ్చి మంచం మీద ఎదుగుతున్న పిల్లల్ని చూస్తు మురిసిపోతుంటాడు ఎప్పుడూ పనేనా ? కాస్త ఇంటి దగ్గర ఉండొచ్చుగా..' అని చిరాకు పడుతున్న అమ్మ మాటలు వింటుంటాం. పిల్లలు కూడా నాన్నను మిస్ అవుతుంటారు. నిజానికి నాన్నను నాన్నే మిస్ అవుతుంటాడు. కుటుంబ అభివృద్ధి కోసం చేసే పోరాటంలో పెళ్లై, పిల్లలు పుట్టగానే నాన్న జీవితం నాన్న చేతుల్లో ఉండదు. మనందరి కోసం నాన్న రాత్రి, పగలు పనిచేయాలి. చదువులు, సమస్యలు, బంధువులు, పండగలు, బర్త్‌డేలు, ఆసుపత్రులు.. వీటన్నింటితో నాన్న నలిగిపోతుంటాడు. ఆయనకు ఆరోగ్య సమస్యలు వస్తుంటాయి. వృద్ధాప్యం వల్ల అని పిల్లలు అనుకుంటారు. వృద్ధాప్యం ఇంకా రాలేదు.. మీ కోసం అనుక్షణం కరిగిపోతూ, కాలిపోతున్న నాన్నకి లోపల ఆరోగ్యం ఎంత దెబ్బ తింటోందో తెలియదు. నాన్న డాక్టర్ ను కలిసిన విషయం కూడా మనకు తెలియదు. ఎందుకంటే.. ఆ రిపోర్ట్‌లు తీసుకుని ఇంటికి రాడు. తన పిల్లలు గొప్ప వాళ్లు అవుతారని నాన్న కు విపరీతమైన నమ్మకం. అందుకే అప్పులు చేసి చదివిస్తాడు. ఆఫీసుకు సెలవు పెట్టి, స్కూల్‌లో పిల్లల సీటు కోసం లైన్‌లో నిల్చుంటాడు.మీరు పరీక్ష రాస్తుంటే బయట రోడ్డు పక్కన ఎండలో నిల్చుని ఉంటాడు. పాఠశాల గోడలెక్కి చిట్టీలు వేసి తన పిల్లలను పాస్ చేయాలని ఆరాటపడుతూ ఆయాస పడుతూ దెబ్బలు తగిలించుకుంటాడు.పిల్లలు ఏదో సాధించేస్తారని ఆశ. ఆస్తులు అమ్మేసి కూతురి పెళ్లి ఘనంగా చేస్తాడు. ఎక్కడ, ఎన్ని సంతకాలు పెడతాడో మనకు తెలియదు. కొన్ని వందలసార్లు అమ్మ ఏడ్వడం చూశాం కానీ, నాన్న ఏడ్వడం ఎప్పుడైనా చూశారా? నాన్న కూడా ఏడుస్తాడు కానీ మీ ముందు ఏడ్వడం ఆయనకు ఇష్టం ఉండదు. ఎక్కడో ఒంటరిగా కూర్చుని ఏడుస్తాడు. పిల్లలు పెద్దయి, ఏదో పని చేసుకునే సమయానికి.. నాన్న అన్నీ అమ్ముకుని, అంతా అయిపోయి, అంతంత ఆరోగ్యంతో మిగిలిపోతాడు. అప్పుడే పిల్లలు నాన్నకు ఎదురు చెప్పడం మొదలు పెడతారు. 'ఇన్నాళ్లూ వీళ్ల కోసం ఇంత చేశానా?, నేను ఎవరి కోసం బతికాను?' అనే ఆలోచనలు నాన్నకు వస్తాయి. నా కోసం నేను ఏదీ దాచుకోలేదే అనుకుంటాడు. నిజానికి నేను అనే ఆలోచన అప్పటి వరకు నాన్నకు తెలియదు. ఈ కవితా కథనం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవ్వడంతో పాటు అందరూ చర్చించుకోవడం విశేషం నాన్న నలిగిపోయే ప్రతి కుటుంబంలో ఒక సమిదే.

తెలుగు దినపత్రిక
# పీపుల్స్ మోటివేషన్
People's Motivation

సోమవారం । జూన్ । 17 । 2024




# మర్యాదపూర్వకంగా టిడిపి ఉపాధ్యక్షుడుని కలిసిన కార్యకర్తలు





**ఆదోని, జూన్ 16 (పీపుల్స్ మోటివేషన్):-**

ఆదివారం రోజు తెలుగు దేశం పార్టీ ఉపాధ్యక్షుడు ఆదోని టీడీపీ ఇంఛార్జి మీనాక్షి నాయుడుని మర్యాదపూర్వకంగా ఆదోని వాసులు, కార్యకర్తలు, మహిళలు, పెద్ద సంఖ్యలో అభిమానులు, నాయకులు కలిసి ఆయనకు శుభకాంక్షలు తెలియజేశారు. టీడీపీ ఇంఛార్జి మీనాక్షి నాయుడు మాట్లాడుతూ.. రాష్ట్ర చరిత్రలోనే ఈ గెలుపు ఒక్క సువర్ణ అక్షరాలతో కూడుకొన్నది అని అన్నారు. ప్రజలు మార్పు కోసం నారా చంద్రబాబు నాయుడికి పట్టం కట్టారని అమరావతి రాజధాని గా పనులు జరుగుతాయన్నారు.



## అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ విద్యాసంస్థలను అరికట్టడంలో మండల విద్యాశాఖ అధికారులు విఫలం: ఏఐఎస్ఎఫ్




**కోడుమూరు, జూన్ 16 (పీపుల్స్ మోటివేషన్):-**

మండల విద్యాశాఖ అధికారులు నిద్ర మబ్బు వదిలి అధిక ఫీజుల మీద పాఠ్యపుస్తకాలు అమ్మేటువంటి పాఠశాలల మీద చర్యలు తీసుకోకపోతే చూస్తూ ఊరుకోము ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు డి.సోమన్న హెచ్చరిక మండలంలో బీసీ బాలుర,హాస్టల్ ఏర్పాటు చేయాలి. ఈరోజు అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ కోడుమూరు మండల ముఖ్య నాయకుల సమావేశం స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు డి సోమన్న పాల్గొన్నారు.ఈ సమావేశాన్ని ఉద్దేశించి జిల్లా అధ్యక్షులు డి. సోమన్న జిల్లా సహాయ కార్యదర్శి బి. రంగస్వామి మాట్లాడుతూ కోడుమూరు మండలంలో రేకుల షెడ్లలో చిన్నచిన్న రూములలో పాఠశాలలు నిర్వహిస్తూ ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతూ వేలకవేలు ఫీజులు అక్రమంగా వసూలు చేస్తున్నారని ఇంత వసూలు చేస్తొ ఉన్న మండల విద్యాశాఖ అధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడం సిగ్గుచేటు అయినటువంటి విషయమని తక్షణమే అధిక ఫీజులని అరికట్టేందుకు తగు చర్యలు చేపట్టాలని పాఠ్యపుస్తకాలు అమ్ముతూ అధిక ఫీజులు వసూలు చేస్తున్నటువంటి విద్యాసంస్థలను గుర్తింపు రద్దు చేయాలని లేని పరిస్థితుల్లో ఏఐఎస్ఎఫ్ గా పెద్ద ఎత్తున ఎంఈఓ ఆఫీస్ ముందర ఉద్యమిస్తామని వారు అదేవిధంగా కోడుమూరు మండలంలో ఒక నియోజకవర్గమైన కూడా ఇప్పటివరకు చదువుకునేటువంటి విద్యార్థులకు కనీసం హాస్టల్ వసతి కూడా కల్పించలేకపోవడం రాష్ట్ర ప్రభుత్వాల దౌర్భాగ్యమని కోడుమూరు నియోజకవర్గంలో బిసి బాలుర బాలికల హాస్టల్ లను ఏర్పాటు చేయాలని వాటితో పాటు ఎస్సీ ఎస్టీ ఉన్నటువంటి హాస్టల్లో మౌలిక వస్తువులు కల్పించి అదనపు సీట్లు కేటాయించాలి అదేవిధంగా ఏపీ మోడల్ స్కూల్ కి రోడ్డు వేయాలని డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు.లేని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమాలకు పూనుకుంటామని వారు హెచ్చరించారు. ఈ ఉద్యమంలో నియోజకవర్గంలోని ఎమ్మెల్యేలతో పాటు అందరిని కలిసి ఉద్యమాన్ని ముందరికి తీసుకపోతామని విద్యార్థులకు న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తామని వారు తెలియజేశారు.ఈ సమావేశంలో సిద్దు,మహమ్మద్ ఆజాం, మహమ్మద్ మోఫీత్, షేక్షావలి తదితరులు పాల్గొన్నారు.

## బక్రీద్ పండుగ త్యాగానికి ప్రతీక- నాలి అఫ్జల్

**శిరివెళ్ల, జూన్ 16 (పీపుల్స్ మోటివేషన్):**



ముస్లిం సోదరులకు బక్రీద్ పర్వదినం అత్యంత ఆరాధ్యమైన, ప్రీతికరమైనదని, బక్రీద్ పండుగ త్యాగానికి ప్రతీకని భూమా కుటుంబ అభిమాని నాయకులు కీ. శే. నాలి వలి కుమారుడు శిరివెళ్ల టీడీపీ మైనార్టీ యువ నాయకులు నాలి అఫ్జల్ పేర్కొన్నారు. బిముస్లిం ఆరాధ్య గ్రంథం దివ్యఖురాన్ ప్రకారం సమాజంలో త్యాగనిరతికి ప్రతీకగా జరుపుకునే పండుగ బక్రీద్ అన్నారు.ఎంతో పవిత్రంగా జరుపుకునే ఈ పండుగ దానగుణానికి, త్యాగానికి ప్రతీక అన్నారు. ఈ పండుగ ప్రతి ఒక్కరికి సకల శుభాలతో పాటు ఆయురారోగ్యాలు అందాలని, అందరి జీవితాల్లో ఆనందాన్ని నింపాలని ఆకాంక్షిస్తూనని శిరివెళ్ల మండల కేంద్రం టిడిపి మైనార్టీ యువ నాయకులు నాలి అఫ్జల్ అన్నారు.

## పీవీ నరసింహారావు తెలంగాణ ఫిషరీస్ యూనివర్సిటీ సందర్శన

- రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జిల్లెల్ల చిన్నారెడ్డి
- తెలంగాణఫిషరీస్ కాలేజీ పరిశీలన
- విద్యార్థులతో స్వయంగా మాట్లాడి విషయాలపై చర్చ
- కోర్స్ పూర్తయిన వెంటనే ఉపాధి అవకాశాలు కల్పిస్తాము
- యూనివర్సిటీ వెనకాల డంపింగ్ యార్డ్ తొలగించాలి



**పెబ్బేరు, 16 జూన్ (పీపుల్స్ మోటివేషన్):-**

పెబ్బేరు మున్సిపల్ పట్టణపరిధి సమీపంలోఉన్న తెలంగాణ పీవీ నరసింహారావు ఫిషరీస్ యూనివర్సిటీ ని పరిశీలించడం జరిగింది. డాక్టర్ జిల్లేల చిన్నారెడ్డి రాష్ట్ర ప్రణాళికా సంఘ ఉపాధ్యక్షులు ఏఐసీసీ కార్యదర్శి, స్వయంగా విద్యార్థులతో మాట్లాడుతూ ఉపాధి అవకాశాల గురించి వారితో చర్చించారు. ప్రభుత్వంతో మాట్లాడి కోర్స్ అయిన వెంటనే ఉద్యోగ అవకాశాలు కల్పన కృషి చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది. యూనివర్సిటీ వెనకాల డంపింగ్ యార్డ్ ఉన్నందున దుర్వాసన పొగ వస్తుందని విద్యార్థులు తెలుపగా వెంటనే మున్సిపల్ కమిషనర్ తో మాట్లాడి డంపింగ్ యార్డ్ ప్రాంతాన్ని మార్చాలనిసూచించారు.ఈ కార్యక్రమంలో పెబ్బేరు మార్కెట్ యార్డ్ చైర్మన్ గౌని బుచ్చారెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, ప్రవీణ్ కుమార్ రెడ్డి,దాసరాజు, భాస్కర్,జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ పాతపల్లి చంద్రశేఖర్,విజయ్ గౌడ్,సురేష్,నరసింహ ,చరణ్, సోప్పరి రమేష్,తదితరులు పాల్గొన్నారు.



## నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డిని శబరిని కలిసిన కొండమ నాయున పల్లె యువత





**నంద్యాల, జూన్ 16 (పీపుల్స్ మోటివేషన్):-**

నంద్యాల పట్టణంలో ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరిని ఆదివారం రోజు కొండమనాయునిపల్లె గ్రామ ప్రజలు మరియు యువత మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా రాయలసీమ ఉద్యమ యువ నాయకులు రాథోడ్ సీమకృష్ణ, శ్రీరామ్,భాస్కర్,హనుమాన్ నాయక్ మాట్లాడుతూ నంద్యాల పార్లమెంట్ తొలి మహిళ ఎంపీ అభ్యర్థిని మర్యాదపూర్వకంగా కలిశామని అదే విధంగా గ్రామ సమస్యలను విన్నవించినట్టు వారు తెలియజేశారు. త్రాగునీరు త్రాగునీరు తో పాటు స్థానిక పరిశ్రమలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని వారు ఈ సందర్భంగా తెలియజేశామన్నారు. ఈ కార్యక్రమంలో రాజా, రంగముని నాయక్,వెంకటేష్ నాయక్,సాయి తదితరులు పాల్గొన్నారు.

## మెగా డీఎస్సీ సంతకం పై థాంక్యూ సీఎం కార్యక్రమం

**రాయలసీమ ఉద్యమ యువ నాయకులు రాథోడ్ సీమకృష్ణ**




**కర్నూలు, జూన్ 16 (పీపుల్స్ మోటివేషన్):-**

కర్నూలు పట్టణంలోని ఆదివారం రోజు స్థానిక అశోక స్టడీ సర్కిల్లో రాయలసీమ ఉద్యమ యువ నాయకుల సమక్షంలో డీఎస్సీ నిరుద్యోగులు థాంక్యూ సీఎం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాయలసీమ ఉద్యమ యువ నాయకులు రాయలసీమ విద్యార్థి సమైక్య వ్యవస్థాపక అధ్యక్షుడు రాథోడ్ సీమకృష్ణ మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో భాగంగా తన మొదటి సంతకం మెగా డీఎస్సీ పైనే చేస్తానని వాగ్దానం చేసిన నూతన బాధ్యతలు చేపట్టిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కు థాంక్యూ సీఎం కార్యక్రమం ద్వారా కృతజ్ఞతలు తెలియజేసినట్లు వారు ఈ సందర్భంగా తెలియజేశారు. రాష్ట్రంలో మెగా డీఎస్సీ పైన తొలి సంతకం చేసి 16,347 ఉద్యోగాలు ఇచ్చిన కూటమి ప్రభుత్వానికి మరియు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కు రాయలసీమ ఉద్యమ యువ నాయకుల ఆధ్వర్యంలో నిరుద్యోగులు థాంక్యూ సేమ్ ద్వారా కృతజ్ఞతలు తెలియజేసినట్టు వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చంద్ర,గణేష్ జయరాం పాల్గొన్నారు.

## ఆంధ్ర విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి కుమ్మరి నాగరాజు

**నందికొట్కూర్, జూన్ 16 (పీపుల్స్ మోటివేషన్):-**




ఆదివారం రోజు ఏవీఎస్ (ఆంధ్ర విద్యార్థి సంఘం) రాష్ట్ర స్థాయి సమావేశలు తాడేపల్లిగూడెంలో నిర్వహించుకోవడం జరిగింది. ఇందులో భాగంగా నంద్యాల జిల్లా నందికొట్కూరు తాలూకా పగిడ్యాల మండలం ముచ్చుమర్రి గ్రామానికి చెందిన నాగరాజు ని ఏవీఎస్ ఆంధ్ర విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శిగా నాగరాజు ని స్టేట్ ఆర్గనైజేషన్ తురక ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు ఏదైనా నాగరాజు మాట్లాడుతూ ఆ పైన నమ్మకం ఉంచి రాష్ట్ర కార్యదర్శిగా అవకాశం కల్పించిన అటువంటి ఏవీఎస్ నాయకులకు నా ధన్యవాదాలు ఎన్నుకున్నందుకు నిరంతరం విద్యార్థి సమస్యలకు కోసం పనిచేస్తానని ఆయన తెలిపారు.

తెలుగు దినపత్రిక

పీపుల్స్ మోటివేషన్

People's Motivation



# నటిగా మంచి పేరు తెచ్చుకున్న శ్రియారెడ్డి

ఇప్పుడు అటు ఓటిటి లోనూ, ఇటు వెండితెరపైనే వినిపిస్తున్న పేరు శ్రియ రెడ్డి. తెలుగు, తమిళం, మలయాళం సినిమాలలో నటిస్తూ తనకంటూ ఒక ప్రత్యేకమైన స్థానాన్ని ఏర్పరచుకున్న నటి శ్రియ రెడ్డి. ప్రభాస్ నటించిన 'సలార్' సినిమాలో విలన్ గా నటించి అందరినీ మెప్పించిన నటి శ్రియ ఇప్పుడు అటు వెబ్ సిరీస్ లతో, ఇటు సినిమాలతో చాలా బిజీగా వున్న నటీమణుల్లో ఒకరు. ఆమధ్య అమెజాన్ ప్రైమ్ లో వచ్చిన 'సుజల్: ది ఓ÷-టర్గ్÷క్స్' అనే వెబ్ సిరీస్ లో పోలీసాఫీసర్ గా నటించి మంచి ప్రసంశలు పొందిన నటి. ఆ వెబ్ సిరీస్ లో ఒక ప్రధాన పాత్ర అయిన పోలీసు ఆఫీసరు రెజినా థామస్‌గా నటించి మెప్పించింది. ఫ్యాక్టరీ కాలిపోవడంతో మొదలైన ఆ వెబ్ సిరీస్ లోతుకు వెళ్లేకొద్దీ ఎన్నో సంచలన విషయాలు వెలుగులోకి వస్తుంటాయి. ప్రేక్షకులు ఊహించినట్టే ఉంటుంది అనుకున్న సమయానికి, ఊహకందని విధంగా ట్విస్టులు వస్తూ ఉంటాయి, సస్పెన్స్ కొనసాగుతూ ఉంటుంది. మొదటి ఎపిసోడ్ నుండి చివరి వరకూ ఆ ఆసక్తికరమైన అంశం అలా కొనసాగుతూనే ఉంటుంది. అన్ని ఎపిసోడ్స్ లో కూడా శ్రియ తనదైన నటనతో మెప్పించి, ఆ పాత్రలో లీనమైపోయింది. ఒక పక్క పోలీసాఫీసరుగా తన బాధ్యతలు నెరవేరుస్తూనే, అందులోవుండే సాధకబాధకాలు, అలాగే ఇంకో పక్క ఒక టీనేజర్ అబ్బాయికి తల్లిగా శ్రియ చేసిన నటన అబ్బురపరిచింది. చివరి వరకు అలానే కంటిన్యూ చేసి ఆ వెబ్ సిరీస్ విజయంలో శ్రియ ముఖ్య భూమిక పోషించింది. ఈమధ్యనే విడుదలైన ఇంకో వెబ్ సిరీస్ 'తలైమై సేయలగం'. ఇది పొలిటికల్ థ్రిల్లర్ గా వచ్చింది. పవన్ కళ్యాణ్ నటించిన 'ఓజి' లో కూడా శ్రియ ఒక ముఖ్యపాత్ర పోషిస్తోంది. 'సలార్' పార్టు 2 లో శ్రియ పాత్ర ఇంకా బాగుంటుంది అని కూడా అంటున్నారు. ఆమెని ప్రధాన విలన్ గా చూపించవచ్చు అని కూడా ఒక టాక్ నడుస్తోంది. ఈ సినిమాతో పాటు ఇంకో తమిళ సినిమా కూడా చేస్తున్న శ్రియ తనకి నచ్చిన పాత్రలు చేస్తూ అందరినీ మెప్పిస్తోంది.



# చందమామ కథకు ప్రాణం పోసిన యక్షిణి

పురాణాల్లో మాత్రమే కనిపించే 'యక్షిణి' పాత్రను వెబ్‌సిరిస్‌గా రూపొందించారు. మాయ (వేదిక) ఒక యక్షిణి. శాపం కారణంగా భూమిపై ఉండాల్సి వస్తుంది. తమో రజో గుణంతో వందమంది పురుషులను అనుభవించి, వారిని హతమార్చిన తర్వాతే ఆమెకు శాపవిమోచనం కలుగుతుంది. 99 మందిని అలాగే హత్య చేస్తుంది. అయితే, 100వ వ్యక్తి మాత్రం నిష్ట కలిగిన బ్రహ్మచారి అయి ఉండాలన్నది షరతు. అలాంటి వ్యక్తి కోసం వెతుకుతున్న తరుణంలో కృష్ణ (రాహుల్ విజయ్) పరిచయం అవుతాడు. హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో మేనేజర్‌గా పనిచేస్తూ ఉంటాడు. మరోవైపు క్షుద్ర, తాంత్రిక విద్యలతో యక్షిణిని వశం చేసుకోవాలని ఎదురు చూస్తుంటాడు మహాకాల్ (అజయ్). మరి యక్షిణితో పరిచయం అయిన తర్వాత కృష్ణ జీవితం ఎలాంటి మలుపులు తిరిగింది? ఈ క్రమంలో అతడికి ఎదురైన పరిస్థితులు ఏంటి? మహాకాల్ ఎందుకు యక్షిణిని వశం చేసుకోవాలని చూస్తున్నాడు? ఇవన్నీ తెలియాలంటే సిరీస్ చూడాల్సిందే! పురాణాల్లో పాత్రల ఇతివృత్తంగా సినిమాలను తెరకెక్కించడం తెలుగు తెరకు కొత్తేమీ కాదు. మారిన పరిస్థితులకు వాటిని అన్వయించుకుంటూ రూపొందిస్తే ప్రేక్షకులు ఆదరిస్తారనేందుకు 'బింబిసార'లాంటి అనేక ఉదాహరణలు ఉన్నాయి. అయితే, కథ చెప్పే విషయంలో ఎంత కన్విన్సింగ్‌గా చెప్పామన్న దానిని బట్టే విజయం ఆధారపడి ఉంటుంది. 'యక్షిణి' అనే చందమామ కథను ఆసక్తికరంగా తీర్చిదిద్దడంలో దర్శకుడు తేజ మర్ని మంచి ప్రయత్నం చేశారు. బ్రహ్మచర్యం నిష్టగా పాటించే వ్యక్తిని అనుభవించి చంపడం ద్వారా తన శాపాన్ని విమోచన చేసుకోవాలనుకునే యక్షిణి మాయ.. భూమ్మీద ఉన్న యక్షిణిని ఎలాగైనా వశం చేసుకోవాలనుకునే మహాకాల్.. తన కలల రాకుమారితో జీవితాన్ని గడపాలనుకునే సగటు కుర్రాడు కృష్ణ.. ఇలా మూడు పాత్రలను కనెక్ట్ చేస్తూ సిరీస్‌ను నడిపాడు. ప్రతీ ఎపిసోడ్ ముందు అలకాపురి దాని చరిత్ర, యక్షిణులు ఎవరు వారి గతం ఏంటి? నాగలోకానికి, యక్షలోకానికి మధ్య ఉన్న వైరం. యక్షిణి భూమ్మీదకు రావడానికి గల నేపథ్యాన్ని వివరిస్తూ సిరీస్‌ను తీర్చిదిద్దారు. యక్షిణి పాత్ర, ఆమె శాపాన్ని పరిచయం చేస్తూ సన్నివేశాలను మొదలుపెట్టిన దర్శకుడు నేరుగా మూడు ప్లాట్‌లను సమాంతరంగా చూపిస్తూ వెళ్లాడు. యక్షిణి అందం చూసి ఆమెతో ప్రేమలో పడిన కృష్ణ చావకుండా ఎలా బయటపడతాడా? అన్న ఉత్కంఠతో సన్నివేశాలను తీర్చిదిద్దిన విధానం బాగుంది. యక్షిణిని వశం చేసుకోవడానికి మహాకాల్ వేసే ప్లాన్‌లను కూడా ఆసక్తికరంగా చూపించారు. మూడో ఎపిసోడ్‌లో జ్వాలాముఖి( మంచు లక్ష్మి) పాత్రతో ఊహించని ట్విస్ట్ ఇచ్చాడు దర్శకుడు. థ్రిల్లింగ్‌గా సాగే సిరీస్‌లో మధ్యలో కృష్ణ కుటుంబం చేసే హంగామా సాగదీత వ్యవహారంలా అనిపిస్తుంది. ఒక సీరియస్ మోడ్‌లో సాగుతున్న సిరీస్ స్పీడ్ బ్రేకర్ వేసినట్లు అనిపిస్తుంది. ఒక్కో ఎపిసోడ్ సాగుతున్న కొద్దీ పాత్రలు వాటి నేపథ్యాలు మరింత బలంగా చూపించాల్సింది పోయి, సన్నివేశాలు, పాత్రలు పలుచబడిపోయాయి. కథ ముందుకు సాగుతున్న కొద్దీ పాత్రల మధ్య సంఘర్షణ తగ్గిపోతూ వచ్చింది. ముఖ్యంగా చివరి రెండు ఎపిసోడ్స్‌లో అనవసరంగా కామెడీని ఇరికించారు. ప్రధాన పాత్రలకు ఎమోషన్స్ జొప్పించి ప్రేక్షకులకు కనెక్ట్ చేయాలని చూసినా అవి కూడా అంతగా రక్తి కట్టలేదు. చివరి ఎపిసోడ్ 'విరూపాక్ష', 'అంజి' సినిమాలు గుర్తుకు వస్తాయి. దర్శకుడు తేజ మర్ని చందమామ కథను ఎంచుకుని, నేటి తరానికి అనుగుణంగా తీర్చిదిద్దిన విధానం కొంత వరకూ బాగుంది.

Printed, Published and Owned by M.RAMESH, H.No. 87/-569, Ground floor, Madhavanagar, Kurnool City, Kurnool - 518002, Andhrapradesh State, and Printing at PSR Printers, No.87-569, Beside, Chenchureddy Apartment, Madhava nagar,Kurnool - 518002 District, Andhrapradesh, Published from H.No. H.No. 87/-569, Ground floor, Madhavanagar, Kurnool City, Kurnool - 518002, Andhrapradesh, Editor : M.RAMESH, Mob : 8008622746,E-mail : peoplesmotivation22@gmail.com